



మంచాలు పట్టడం లేదు..!

జిల్లా ఆస్పత్రిలో భారీగా జ్వరపీడితులు

జిల్లా సర్వజన ఆస్పత్రికి వైరల్ ఫీవర్స్ బాధితులు క్యూ కట్టారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి మంగళవారం సాయంత్రం పదుల సంఖ్యలో బాధితులు తరలిరావడంతో క్యాజువాలిటీ కిటకిటలాడింది. తగినన్ని పడకలు లేకపోవడంతో ఒక్కో పడకపై ఇద్దరు ముగ్గురికి వైద్య సేవలు అందించారు. నీరసించిపోయిన రోగులు ఎక్కడికక్కడ కూలబడిపోయారు. రోగులను ఎక్కడ ఉంచాలో అర్థంకాక వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పడకలపై చోటు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడే ఉంచి చికిత్స చేశారు. ఎప్పటిలాగే రోగులను వార్డులకు తరలించేందుకు స్ట్రెచ్చర్స్, ఎంఎన్‌ఓలు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అధికారికంగా ఆస్పత్రిలో 67 మంది జ్వర పీడితులు ఉన్నట్లు చూపిస్తున్నారు. ఇందులో ఐదుగురు డెంగీ బాధితులు.

- అనంతపురం టౌన్

రాజీకొస్తావా.. కాల్చిపారేయాలా..?

తుపాకీతో నిందితుడి హల్‌చల్

చితకబాది.. పోలీసులకు అప్పగించిన బాధితులు



గంగాధర్ (నల్ల చొక్కా వ్యక్తి) నుంచి తుపాకీని లాక్కుంటున్న ఎంపీటీసీ కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో నాటు తుపాకీ)

రామగిరి, సెప్టెంబరు 10: మండల పరిధిలోని సుద్దకుంటపల్లిలో గంగాధర్ అనే వ్యక్తి నాటు తుపాకీతో మంగళవారం హల్‌చల్ చేశాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులో రాజీకి రావాలని బెదిరించాడు. దీంతో బాధితులు ఎదురు తిరిగి గంగాధర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. గంగాధర్ తనను వేధిస్తున్నారని సుద్దకుంటపల్లికి చెందిన ఎంపీటీసీ సాయిలీల ఈ ఏడాది మార్చిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో రాజీకి రావాలని ఎంపీటీసీ భర్తను, బంధువులను నాటు తుపాకీతో గంగాధర్ బెదిరించాడు. దీంతో ఎంపీటీసీ భర్త కేశవ, వారి కుటుంబ సభ్యులు గంగాధర్‌పై ఎదురుదాడికి దిగి, కర్రలతో చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ సుద్దకుంటపల్లికి వెళ్లి స్థానికులను విచారించారు. తుపాకీని స్వాధీనం చేసుకుని, గంగాధర్‌ను పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. గంగాధర్ వైసీపీలో ఉండేవాడు. ఎన్నికల సమయంలో టీడీపీలో చేరాడు. గొడవ అనంతరం ఇరువర్గాలవారు రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విత్తును మింగిన వాన

భారీగా నష్టపోయిన మిర్చి రైతులు

రెండుసార్లు దున్నేసి.. మూడోసారి విత్తనం

తెరిపి ఇవ్వకుంటే ఇదీ కష్టమే అంటున్న రైతు

గత ఏడాది వెంటాడిన తెగుళ్లు.. ధరాఘాతం



మూడోసారి విత్తినా.. ఖాళీగానే మిర్చి పొలం

గుంతకల్లు, సెప్టెంబరు 10: మిర్చి పంటతో ఒక ఏడాది భారీగా నష్టపోయారు. ఆ భయంతో ఇంకొక్కసారి దాని జోలికి పోకూడదని అనుకున్నారు. కానీ ఈసారి కలిసొస్తుందేమో అనుకుని మళ్లీ అదే పంట వేశారు. వర్షాలు వెంటాడటంతో విత్తనం మొలకెత్తలేదు. ఒకటోసారి.. రెండోసారి ఇదే అనుభవం. తాజాగా మూడోసారి విత్తనం వేశారు. ఈ క్రమంలో రూ.లక్షలు నష్టపోయారు. గుంతకల్లు మండలం జి.కొట్టాల రైతులను వెంటాడుతున్న కష్టాలు ఇవి. పక్షం రోజులు తెరిపి ఇస్తే.. మూడోసారైనా మొలకలు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. నల్లి పోటు కారణంగా గత ఏడాది మిర్చి రైతులు భారీగా నష్టపోయారు. పురుగు మందులు పనిచేయక దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. ఇది చాలదన్నట్లు ధరలు సగానికి సగం పతనమయ్యాయి. నాణ్యమైన మిర్చి క్వింటం ధర రూ.60 వేలు ఉంటుంది. కానీ గత ఏడాది రూ.30 వేలకు పడిపోయింది. దీంతో దిగుబడులను కోల్డు స్టోరేజీలకు తరలించారు. ఏడాది గడిచినా ధరలు పెరగకపోగా.. రూ.20 వేలకు పడిపోయాయి. నిల్వ ఉంచినా ప్రయోజనం లేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది దిగుబడులు వచ్చేలోపు కనీసం రూ.30 వేలు పలికినా అమ్మేస్తామని రైతులు అంటున్నారు.

వెంటాడుతున్న వానలు

గత ఏడాది అనుభవంతో నల్లరేగడి రైతులు ఈసారి మిర్చి జోలికి వెళ్లలేదు. జి.కొట్టాల, పెంచలపాడు, కొనకొండ్ల, గుంతకల్లు, గడేకల్లు, కర్నూలు జిల్లా సరిహద్దు రైతులు 60 శాతం మంది మిర్చి పంటను పక్కనపెట్టి కంది వైపు మొగ్గారు. కానీ మిగిలినవారు 'ఇంకొక్క ఛాన్స్' అనుకుని ఊబిలోకి దిగినంతపని చేశారు. సుమారు 1100 ఎకరాల్లో నెల కిందట మిరప విత్తనం వేశారు. అది మొదలు వదలకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఒక్క గింజ కూడా మొలకెత్తలేదు. దీంతో రెండు వారాల క్రితం మరో మారు భూమిని చదనుచేసి రెండోసారి విత్తనం వేశారు. మరోమారు అదే అనుభవం ఎదురైంది. తాజాగా మూడోసారి విత్తనం వేశారు. వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ మొలిచినా.. వర్షాలకు కలుపు మొక్కలు భారీ స్థాయిలో వచ్చాయి. వాటిని తొలగించాలంటే కూలీల ఖర్చు తడిసి మోపెడవుతుందని అంటున్నారు. విత్తనం వేస్తే పంట సమయానికి రాదని భావించి.. కొందరు నర్సరీలలో నారను తెచ్చి నాటుకోవాలని భావిస్తున్నారు. కానీ నారుకు తెగుళ్ల బెడద ఉంటుందని సందేహిస్తున్నారు. మొత్తంగా మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

పడిపోయిన కౌలు రేట్లు

మిర్చి పంట ఎదుర్కొంటున్న సంక్షోభం కారణంగా నల్లరేగడి భూములను కౌలుకు అడిగేవారు లేకుండాపోయారు. గత సంవత్సరం ఎకరానికి రూ.50 వేలదాకా ఉన్న కౌలు ఈ ఏడాది రూ.30 వేలకు పడిపోయింది. హంద్రీనీవా కాలువ పక్కన పొలాను కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేసే గుంటూరు జిల్లా రైతులు ఇక లాభం లేదనుకుని స్వస్థలాలకు వెళ్లిపోయారు. స్థానిక రైతులు కూడా కౌలు ఆలోచన చేయడం లేదు. ఈ ఏడాది రూ.30 వేల ప్రకారం కౌలుకు తీసుకున్న కొందరు.. విత్తనం మొలకెత్తక నష్టపోయామని, కౌలు మరింత తగ్గించాలని పెద్ద మనుషుల పంచాయితీలు నిర్వహించారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని కొందరు భూ యజమానులు కౌలును రూ.20 వేలకు తగ్గించుకున్నారు. మరికొందరు రైతులు రాజీపడ్డారు. మరి కొందరు కౌలు అడ్వాన్సులు తిరిగి ఇచ్చేసి.. సొంతంగా పప్పుశనగను సాగుచేయడానికి సిద్ధమౌతున్నారు.

ఎప్పుడూ ఇలా జరగలేదు..



ఈ సీజన్‌లో ఒకసారికాదు, రెండుసార్లు కాదు.. ఏకంగా మూడుసార్లు మిర్చిని సాగుచేశాము. వర్షాల కారణంగా మొలకలు రాకపోవడం, పంటలను తొలగించడం గతంలో ఎన్నడూ జరగలేదు. మొలకలు వచ్చినా.. వర్షాల కారణంగా మునుముందు తెగుళ్ల బెడద తప్పేలా లేదు. ఇక మిర్చి జోలికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నాం.

- ఓబుళనాయుడు, జి.కొట్టాల

మూడోసారి విత్తనం వేశాను..



నాకున్న 13 ఎకరాల్లో ఈ సంవత్సరం రెండుసార్లు మిర్చి విత్తనం వేశారు. వర్షాల కారణంగా మొలకలు రాలేదు. మూడోసారి విత్తాక మొలకలు వస్తున్న తరుణంలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో తెలియడం లేదు. పంట నిలవకపోతే ఈసారి భారీ నష్టాలు తప్పవు. అప్పులే మిగులుతాయి.

- ధనుంజయ, జి.కొట్టాల

ఎకరాకు రూ.లక్ష నష్టం..



నాకు 14 ఎకరాల పొలం ఉంది. ఇందులో నాలుగు ఎకరాలలో కంది, రెండు ఎకరాల్లో మిర్చిని రెండుసార్లు సాగుచేశాను. మిగిలిన భూమిని రూ.30 వేలతో కౌలుకు ఇచ్చాను. కిందటిసారి కౌలు ధర రూ.55 వేలు ఉన్నింది. ఈసారి సగానికి పడిపోయింది. మిర్చి మొలక రాని కారణంగా ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపోయాను. ఇంకోసారి విత్తనం వేశాను. వర్షాలు ఆగకపోతే వైరస్ సోకుతుంది. తెగుళ్ల బెడదను తట్టుకుని పంట నిలబటం కష్టంగా మారుతుంది.

- సుబ్బయ్య, జి.కొట్టాల

గోడౌన్‌లో ఉంచా..



కిందటి సంవత్సరం మిర్చి దిగుబడి వచ్చే సమయానికి రూ.60 వేలు ఉన్న ధర రూ.30 వేలకు పడిపోయింది. రేటు వస్తుందని కోల్డు స్టోరేజీలో పెట్టాను. కానీ ధర మరింత తగ్గి రూ.18 వేలకు చేరింది. కనీసం రూ.30 వేల ధర వచ్చినా వచ్చే నెలలో అమ్మేస్తాను. మిర్చితో భారీగా నష్టపోయాను. ఈసారి పప్పుశనగ వేయాలనుకుంటున్నాను.

- రామకృష్ణారెడ్డి, జి.కొట్టాల

మిర్చి పంటను వేయలేదు



గత ఏడాది ఆరు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ధర లేక రూ.2 లక్షల నష్టం వచ్చింది. అందుకే ఈసారి మిర్చి జోలికి వెళ్లలేదు. ఈ నెలాఖరులో పప్పుశనగ పంట పెడతాను. ఈ సంవత్సరం మిర్చి పెట్టి చేతులు కాల్చుకున్న రైతులను చూస్తే పంట పెట్టకపోవడమే మంచిదైందని అర్థమైంది నాకు.

- లక్ష్మణమూర్తి, జి.కొట్టాల



ఆమె మరణానికి మీరే కారణం

వైద్యులు, సిబ్బందిపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం



వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 10: హైరిస్క్ గర్భిణుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 10న బేతాపల్లి పీహెచ్‌సీ పరిధిలో సంభవించిన గర్భిణి మృతికి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. జిల్లా కార్యాలయంలో మాతాశిశు మరణాలపై మంగళవారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఊబిచెర్లకు చెందిన మనీషా అనే గర్భిణి ప్రసవం సమయంలో ఆగస్టు 10న మృతిచెందారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. హై రిస్క్ కేసు అని తెలిసినప్పుడు ప్రసవానికి వారం ముందుగానే ఆస్పత్రిలో చేర్పించాలి కదా అని ప్రశ్నించారు. 104 వాహనంలో తీసుకొస్తూ.. మళ్లీ గుత్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి ఎందుకు తీసికెళ్లారని నిలదీశారు. అప్పుడే గుత్తి, లేదా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి ఎందుకు తీసుకువెళ్లలేదని ప్రశ్నించారు. ప్రసవానికి ముందు ఆమెకు స్కానింగ్ ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వీటన్నింటినీ పరిశీలిస్తే.. మనిషా మరణానికి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని స్పష్టమౌతోందని అన్నారు. బాధ్యులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, వారి సమాధానాన్ని చూసిన తరువాత పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుందామని వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ అన్నారు. బిడ్డ చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో ఒకసారి ఆలోచించాలని సూచించారు. మన ఇంట్లో అలాంటి ఘటన జరిగితే ఊరుకుంటామా అని ప్రశ్నించారు. ఇకపై ఒక్కొక్క హైరిస్క్ కేసును వైద్యులు, సిబ్బంది దత్తత తీసుకోవాలని, ప్రసవం అయ్యేవరకూ బాధ్యత వారిదేనని అన్నారు. సమీక్షలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్, డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద నష్టం రూ.1.50 కోట్లు



గోడౌన్‌లోని కాలిపోయిన సామగ్రి

తాడిపత్రి, సెప్టెంబరు 10: పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న లలితా మెగామాల్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.1.50 కోట్ల నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి విద్యుదాఘాతమే కారణమని అన్నారు. మాల్ వెనుక వైపు ఉన్న గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి.. మాల్‌కు వ్యాపించాయి. స్థానికులు గమనించి పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమచారం అందించారు. ఫైర్, పోలీసు సిబ్బంది మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో అనంతపురం నుంచి, అర్జాస్ స్టీల్ ప్లాంట్, అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ, సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి మరో నాలుగు ఫైర్ ఇంజన్లను తెప్పించారు. అప్పటికే సగానికి మాల్‌లోని పైగా వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. గోడౌన్‌లో మంటలను ఆర్పడానికి వీలుకాకపోవడంతో ఎక్స్‌కవేటర్ల సాయంతో గోడలను బద్దలు కొట్టారు. గాలి ఉధృతికి మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మంటలను అదుపు చేసేందుకు సుమారు ఐదు గంటల సమయం పట్టింది. డీఎస్పీ జనార్దన్ నాయుడు, సీఐ సాయిప్రసాద్, అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ మోహన్ పరిస్థితిని సమీక్షించారు.

నష్టాల నివేదికలు పక్కాగా ఉండాలి : కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్/క్లాక్ టవర్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో జరిగిన నష్టం గురించి నివేదికలను పక్కాగా ఇవ్వాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబరులో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై సెక్టార్‌లవారీగా, ఇచ్చిన ఫార్మాట్‌లో నివేదికలు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలకు తప్పనిసరిగా పరిష్కారం చూపించాలని అన్నారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. జిల్లాలో ఈ నెల 14 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకూ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, మారథాన్ రన్స్, వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇసుకపై అభిప్రాయాల సేకరణ

ఉచిత ఇసుక విధానం గురించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఇసుక విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోందని అన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్దేశించిన ధరలను ప్రస్తుతం అమలు చేస్తున్నామని, రవాణా ఖర్చుల గురించి వాహనదారుల సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

పులిహోర విషతుల్యం

60 మందికి అస్వస్థత

గణేశుడి ఉత్సవాలలో అపశ్రుతి





చికిత్స పొందుతున్న బాధితులు, ఆస్పత్రి వెలుపల కుటుంబ సభ్యులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 10: ముష్టికోవెల గ్రామంలో గణేశ నిమజ్జనోత్సవం సందర్భంగా పంచిన ప్రసాదాన్ని తిని సుమారు 60 మంది ఆస్పత్రిపాలయ్యారు. గ్రామంలోని పోతలయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు సోమవారం పులిహోర పంచారు. నిమజ్జనం తరువాత అర్ధరాత్రి సమయంలో ప్రసాదం తిన్నవారు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు బాధితులను వాహనాలలో సీకేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరికొందరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఒక్కసారిగా 60 మందికి పైగా అస్వస్థతకు గురికావంతో బాధిత కుటుంబాలవారు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం ఏమీ లేదని, ఫుడ్ పాయిజన్ అయ్యుంటుందని వైద్యులు వారికి ధైర్యం చెప్పారు. బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ముష్టికోవెలలో ఎస్‌ఎస్ గేటు ఆస్పత్రి వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆహార భద్రత అధికారులు గ్రామానికి చేరుకుని ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. పులిహోర తయారీకి వినియోగించిన నూనె కలుషితం కావడంతో ఇలా జరిగి ఉండవచ్చని గ్రామస్థులు అంటున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

అందుబాటులో లేని వైద్యులు

అస్వస్థతకు గురైన వారిని సీకేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తే.. చికిత్స చేసేందుకు వైద్యులు అందుబాటులో లేరని బాధిత కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీ డాక్టర్ కూడా అందుబాటులో లేరని, ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారని, దీంతో సరైన వైద్యం అందలేదని అన్నారు. మందులు కూడా సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. డాక్టర్లు మంగళవారం ఉదయం నింపాదిగా విధులకు వచ్చారని, ఈలోగా బాధితులకు ఏదైనా జరిగి ఉంటే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ ఆస్పత్రికి వెళ్లి వైద్యుల గురించి ఆరాతీశారు.

ఖర్మాగారం



నేల, పంటలకు నష్టం కలిగిస్తున్న ఫ్యాక్టరీలు

- కాలుష్యంతో తగ్గుతున్న దిగుబడి
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- ఏటా అరకొర పరిహారమే చెల్లింపు
- న్యాయం కోసం
- నేమకల్లు అన్నదాతల వేడుకోలు



అనపకాయలు నల్లగా మారడంతో నీటిలో కడుగుతున్న రైతులు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఏర్పాటైన స్పాంజ్, ఐరన్ ఫ్యాక్టరీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యంతో పంటలు బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూమి కూడా పాడైపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్ పరిసర ప్రాంతాల్లో ఐదు స్పాంజ్, ఐరన్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి సమీపంలోని పంట పొలాలు, నేమకల్లు గ్రామంపై పడుతున్నాయి. దాదాపు 500 ఎకరాలకు పైగా భూమి కాలుష్యం అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తీవ్ర కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా పంటలు సాగుచేయడం కాలుష్యంతో పంటలు ఎండిపోవడం రివాజుగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం ఏడాదికి ఎకరానికి రూ. 1800 నుండి రూ. రెండు వేల వరకు అరకొరగా ఆర్థిక సాయమందించి మమ అనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



న్యాయం చేయాలి : క్రిష్ణయ్య, రైతు, నేమకల్లు

కాలుష్యం వల్ల పంటలు పండటం లేదు. పూర్తిగా పాడవుతున్నాయి. పంటలు బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నాయి. దీంతో అప్పుల పాలయ్యాం. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా న్యాయం చేయడం లేదు. మొన్ననే కలెక్టరేట్ ముట్టడించాం. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. కాలుష్యంతో రోగాల పాలవుతున్నాం.

పంటలు కోల్పోతున్నాం



కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు కోల్పోతున్నాం. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము, ధూళి పంటలపై పడి దిగుబడి రాకుండా పోతుంది. కాలుష్యం బారిన పడిన పంటను పశువులు కూడా తినడం లేదు. రైతులు, కూలీలు రోగాల బారిన పడుతున్నారు. పొలాలలో పనిచేయడానికి కూలీలు రావడం లేదు. అధికారులు పట్టించుకుని మాకు న్యాయం చేయాలి.

- హనుమంతరెడ్డి, రైతు, నేమకల్లు

రోగాలబారిన పడుతున్నాం



ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వల్ల రోగాల బారిన పడుతున్నాం. ఫ్యాక్టరీ పొగ గ్రామంలోకి రావడంతో దానిని పీల్చి దగ్గు, పడిశం ముందుగా వచ్చి ఆస్తమా వస్తోంది. పొలాలలో పనులు చేస్తున్న సమయంలో ఆ కాలుష్యంతో కాళ్లు మండుతున్నాయి. అధికారులు స్పందించి కాలుష్యం ఎక్కువగా రాకుండా చర్యలు తీసుకోవాలి.

- రామాంజి, రైతు, నేమకల్లు

15న పరీక్ష

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 10: ఉమ్మడి జిల్లాలో ఇటీవల విలేజ్ పశుసంవర్ధక సహాయకులుగా ఉద్యోగం పొందిన 451 మందికి ఈనెల 15న సామర్థ్య పరీక్ష ఉంటుందని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. 451 మందికి ప్రత్యేక శిక్షణ పూర్తయ్యిందన్నారు. వీరందరికి ఈనెల 15న అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సామర్థ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను సిబ్బందికి అందజేశామన్నారు.

కసాపురం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, వలంటీర్లు

గుంతకల్లు, సెప్టెంబరు10: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 58.81 లక్షల ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆలయంలో మంగళవారం ఉదయం హుండీలను తెరిచి అందులో భక్తులు వేసిన సొమ్మును లెక్కించారు. శ్రావణ మాస ఉత్సవాలు ముగిసిన వెంటనే అధికారులు హుండీల సొమ్మును లెక్కగట్టారు. ప్రధాన హుండీల ద్వారా రూ. 58,66,842లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 14,882లు కలిపి రూ. 58,81,724లు లభించినట్లు అధికారులు తెలియజేశారు. 5 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి, ఒక అమెరికన్ డాలర్ లభ్యమైనట్లు వివరించారు. శ్రావణ మాసానికి ముందు జూలై 30న హుండీల సొమ్మును లెక్కించారు. అప్పటి నుంచి సెప్టెంబరు 9 వరకూ 41 రోజులలో భక్తులు హుండీలలో వేసిన మొత్తాలను మంగళవారం లెక్కించినట్లు దేవస్థానం ఈఓ భద్రాజీ తెలియజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు పీ వెంకటేశులు, ట్రస్టుబోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


మసాజ్.. గంటకు 2 వేలు..!

- కియ వద్ద మసాజ్ సెంటర్ల ఏర్పాటు
- రెస్టారెంట్‌ల ముసుగులో నిర్వహణ
- మసాజ్ పేరిట గుట్టుగా వ్యభిచారం
- వైసీపీ హయాంలో ఏర్పాటు.. కొనసాగింపు



మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్న అపార్ట్‌మెంట్ ఇదే..

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 10: కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పనిచేసే కొరియా సిబ్బంది, ఇతర ఉద్యోగుల అవసరాల కోసం మార్ట్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటయ్యాయి. స్థానికులు సైతం చిన్నా చితకా వ్యాపారాలతో ఉపాధి పొందుతున్నారు. అయితే కొందరు ఇదే అదనుగా అడ్డదారిలో సంపాదనకు దిగారు. రెస్టారెంట్ల ముసుగులో మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేసి.. లోపల వ్యభిచారం కూడా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పెనుకొండలో రెండు, గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో సుమారు నాలుగు మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పాలసముద్రం వద్ద గుట్టుగా వ్యవహారం సాగుతోంది. కానీ, పెనుకొండ వద్ద ఏకంగా గంటకు రూ.2వేలు, గంటన్నరకైతే రూ.2500 అంటూ ధరలు, సమయం వివరాలతో పోస్టర్లు ఏర్పాటు చేసి మసాజ్ ప్రియులను ఆహ్వానిస్తున్నారు. టీడీపీ హయాంలో మసాజ్ సెంటర్లను ఏర్పాటు చేసినా.. ప్రభుత్వం వాటిని గుర్తించి రెండు నెలల వ్యవధిలోనే అరికట్టింది. నిర్వాహకులకు పోలీసులు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. కానీ, వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు మసాజ్ సెంటర్లను తెరిచారు. పోలీసులు కూడా మౌనం వహించడంతో దందా యథేచ్ఛగా సాగింది. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.



ధరలు, సమయం తెలిపే పోస్టరు

ఆన్‌లైన్‌నే బుకింగ్

కియ సమీపంలో రెస్టారెంట్లు నిర్వహించే ప్రాంతాలను కొందరు మసాజ్ సెంటర్లకు అడ్డాలుగా మార్చుకున్నారు. కొరియన్లు, ఇతర రాష్ట్రాల వారికి మసాజ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. గంటకు రూ.2 వేలు, గంటన్నరకు రూ.2500 చొప్పున ధరలు నిర్ణయించారు. నాలుగు నెలల వ్యవధిలో ఏడు మసాజ్‌లు చేయించుకుంటే రూ.10 వేలు మాత్రమే అంటూ ఆఫర్లతో ఆకర్షిస్తున్నారు. ధరల వివరాలు తెలిసేలా మసాజ్ సెంటర్ల వద్ద పోస్టర్లు కూడా ఏర్పాటు చేశారు.

వేరే ప్రాంత మహిళలతో..

పెనుకొండ నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలతో మసాజ్ చేయిస్తున్నారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఒకటి, జాతీయ రహదారి సమీపంలో కింగ్ మసాజ్ సెంటర్ పేరిట ఒకటి, పాలసముద్రం వద్ద పలుచోట్ల మసాజ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఇక్కడ 'వ్యాపారం' జోరుగా సాగుతోందని సమాచారం. మసాజ్ సెంటర్లను నిర్వహిస్తే.. నిబంధనల మేరకు మహిళలకు మహిళలు, పురుషులకు పురుషులు మాత్రమే మసాజ్ చేయాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా వ్యవహారం సాగుతోంది. పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. దీనిపై పెనుగొండ సీఐ రాఘవన్‌ను స్పందిస్తూ.. ఇప్పటికే రెండు మసాజ్ సెంటర్ల నిర్వాహకులను పిలిపించి తీవ్రంగా హెచ్చరించామని చెప్పారు. నిబంధనల మేరకు మసాజ్ చేయాలని, అలాకాకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, మహిళలతో పురుషులకు మసాజ్ చేయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించామని తెలిపారు.



మసాజ్ సెంటర్ లోపలి భాగం

క్రస్ట్ గేట్లను మార్చాల్సిందే..!

- డ్యాం భద్రతకు ఇదే పరిష్కారం
- 1,632 అడుగుల వరకే నీటిని నిల్వ చేయాలి
- స్టాప్‌లాగ్స్ ఏర్పాటుపై అధ్యయనం అవసరం
- 22వ గేటు వద్ద గుంత వల్ల డ్యాంకు ప్రమాదం
- తుంగభద్రపై నిపుణుల కమిటీ ప్రాథమిక అంచనా
- మూడు రోజుల్లో బోర్డుకు సమగ్ర నివేదిక



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం మంచిది కాదు. మరో క్రస్ట్ గేటు కొట్టుకుపోదని గ్యారెంటీ ఇవ్వలేం. కొత్తగా, అత్యాధునిక డిజైన్‌తో 33 క్రస్ట్‌గేట్లను ఏర్పాటు చేయడం ఉత్తమం' అని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నియమించిన ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డికి కమిటీ మంగళవారం ప్రాథమిక నివేదిక అందజేసింది. డ్యాం గేట్ల అధ్యయనంలో గుర్తించిన అంశాలతో సమగ్ర నివేదిక మూడు రోజుల్లో అందజేస్తామని కమిటీ చైర్మన్ ఏకే బజాజ్ బోర్డు అధికారులకు చెప్పినట్లు సమాచారం. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటుగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం. స్వాతంత్ర్యం రాక ముందే 1945లో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చేపట్టిన ఈ ప్రాజెక్టు 1953లో పూర్తయింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టుగా 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. మూడు రాష్ట్రాలకు 70 ఏళ్లుగా సాగు, తాగునీరు అందిస్తోంది. డ్యాం ప్రారంభం నుంచి క్రస్ట్‌గేట్లు సమస్య తలెత్తలేదు. తొలిసారిగా ఈ ఏడాది ఆగస్టు 10న 19వ నంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తక్షణమే ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అప్రమత్తం కావడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌లను దిగ్విజయంగా అమర్చారు. వరద నీరు కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఇదే సమయంలో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. టీబీపీ బోర్డు సూచన మేరకు ఎన్‌డీఎస్ఏ నియమించిన కమిటీ డ్యాంను పరిశీలించింది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ చైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్ కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రిటైర్డు సెక్రటరీ సిద్దరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ సోమ, మంగళవారం రెండు రోజులు డ్యాంతో పాటు క్రస్ట్‌గేట్లను తనిఖీ చేసింది.

కీలక అంశాలతో నివేదిక

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు జీవితకాలం తీరడంతో వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో కొత్తగేట్లు ఏర్పాటు చేయాలని ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రధానంగా అభిప్రాయపడింది. గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటు గురించి నిపుణులతో అధ్యయనం చేయించాలి. మూడు రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు సంరక్షించే భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్టతపై (డ్యాం హెల్త్ కండిషన్) పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో అధ్యయనం చేయించాలి. క్రస్ట్‌గేట్ల దిగువ భాగం దాదాపు 9 నెలలకు పైగానే నీటిలో ఉంటున్నందున.. వాటి అరుగుదలను కూడా పరిశీలించాల్సి ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. గతంలో 1,632 అడుగుల లెవల్‌లో నీటిని నిల్వ చేసేవారు. ఆ తరువాత గరిష్ఠ లెవల్ 1,633 అడుగుల వరకు నీటి నిల్వ చేయడం వల్ల గేట్లపై ఒత్తిడి పెరిగింది. కాబట్టి.. ఇకపై 1,632 అడుగుల లెవల్‌లోనే నీటిని నిల్వ చేయాలని కమిటీ సూచించింది. గేట్లు కనీసం 2.5 అడుగులు ఎత్తాలని, ఒక అడుగు, అర అడుగు ఎత్తడం వల్ల నీటి ప్రవాహవేగం, ఒత్తిడికి గేట్ల దిగువన డ్యాం బయటివైపు గుంతలు పడి డ్యాం పునాదులకే ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఇక నుంచి గేట్లు ఎత్తాల్సి వస్తే.. కనీసం 2.5 అడుగులు ఎత్తాలని సూచించారు. అలాగే ఈ డ్యాంకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ లేవు. దీంతో సాంకేతిక సమస్యలతో ఏదైనా గేటు కొట్టుకుపోతే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాం ఖాళీ చేయాల్సి వస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా థర్డ్‌పార్టీ నిపుణులతో స్టాప్‌లాగ్ ఏర్పాటుపై అధ్యయనం చేయించి, వారు ఇచ్చే నివేదిక మేరకు ముందుకు వెళ్లాలి. ఇలా పలు సూచనలతో ఏకే బజాజ్ నాయకత్వంలోని నిపుణుల కమిటీ టీబీపీ బోర్డు అధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఆ గుంత వల్ల డ్యాంకు ప్రమాదం

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్‌పూల్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారో.. అదే తరహాలో తుంగభద్ర డ్యాంకు కూడా ఓ భారీ గుంత(పూల్) వల్ల ప్రమాదం పొంచి ఉందని నిపుణులు గుర్తించారు. డ్యాం బయట వైపున 22వ నంబరు గేటు దిగువన 40 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. దీని వల్ల డ్యాం పునాదులకు ప్రమాదం పొంచి ఉందని గతంలోనే నిపుణులు పలుమార్లు హెచ్చరించారు. డ్యాం లెఫ్ట్ బ్యాంక్ (మునిరాబాద్ వైపు) ఆనకట్టకు 100 మీటర్ల దూరంలో పార్కులో బోటింగ్ కోసం సరస్సు ఏర్పాటు చేశారు. ఈ సరస్సులోకి నీరు మళ్లించేందుకు లెఫ్ట్ కెనాల్‌కు తూములు కూడా ఏర్పాటు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. అయితే ఈ సరస్సులోకి డ్యాం నుంచి లీకేజీ అవుతోందని, దీని వల్ల కూడా ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ రెండింటి పూడ్చివేత కోసం బోర్డు ఇంజనీర్లు డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) కింద కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ఈ గుంతల వల్ల డ్యాంకు ప్రమాదం ఉన్న మాట నిజమే అయినా తాము ప్రస్తుతం క్రస్ట్‌గేట్లు, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీపైనే అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని నిపుణుల కమిటీ చెప్పినట్లు తెలిసింది.

చీనీ టన్ను రూ.20 వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలు పలికాయన్నారు.

ఎద్దు దాడి.. రైతు మృతి



మృతి చెందిన రైతు హనుమంతప్ప

డి.హీరేహాళ్, సెప్టెంబరు 10: మండలంలోని హడగలి గ్రామానికి చెందిన రైతు ఎద్దు తొక్కడంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప(70), భార్య గంగమ్మ ఇతర కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఎద్దులను తీసుకుని పొలం పనికి వెళ్లాడు. సాయంత్రం పొలం గట్టుపై మేత మేస్తున్న ఎద్దు బెదిరిపోయి పక్కనున్న హనుమంతప్పపై దాడి చేసింది. కొమ్ములతో గుద్ది కాళ్లతో తొక్కి తీవ్రంగా గాయపరిచింది. కుటుంబసభ్యులు హనుమంతప్పను చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వ విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

ఎప్పుడూ ఇంతే..!

- బదిలీలపై గందరగోళం.. పాత స్థానాల కోసం పట్టు
- సిఫారసు లేఖల కోసం ఉద్యోగుల పాట్లు
- ముడుపుల కోసం అడ్డదారులు
- డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు బదిలీల్లో ఆరోపణలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 10: జిల్లాలో కీలకంగా ఉన్న డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు శాఖల్లో ఉద్యోగులు బదిలీల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదివరకు పనిచేసిన మండలాలకే తిరిగి వెళ్లాలని కొందరు ఉద్యోగులు సిఫారసు లేఖలు, ముడుపులు ఇచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం డ్వామాలో హెచ్‌ఆర్ విభాగంలో ఏకంగా కౌంటర్ ఓపెన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు, ఉద్యోగులే ప్రస్తుతం హెచ్‌ఆర్ విభాగంలో కొనసాగుతున్నారు. దీంతో వారు బదిలీల కోసం సమర్పించుకోవాలని చెప్పకనే చెబుతున్నట్లు సమాచారం. ఉద్యోగులు కూడా తమకు నచ్చిన స్థానం దొరికితే చాలు సమర్పించుకుందాం అన్న ఆలోచనలో ఉన్నారు. గతంలో పనిచేసిన మండలాలకే తిరిగి బదిలీ కావాలంటే ఇచ్చుకోకతప్పదని హెచ్‌ఆర్ విభాగానికి కొంతమేర ముడుపులు ముట్టజెప్పినట్లు సమాచారం. ఇక డీఆర్‌డీఏ-వెలుగులో ఇదివరకు వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన పీడీ కోరుకున్నచోటకు బదిలీ చేసేందుకు సుమారు రూ.2లక్షల నుంచి వసూళ్లు చేసినట్లు గతంలోనే విమర్శలు వచ్చాయి. ఈ విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' బహిరంగపరచడంతో ఆ పీడీ ఒక అడుగు వెనక్కు వేసి సాధారణ బదిలీల్లో న్యాయం చేస్తామని ఉద్యోగులను ఊరడించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ పీడీ లేకపోవడంతో ముడుపులు సమర్పించుకున్న ఉద్యోగులు ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో పడ్డారు.

నిబంధనల మేరకే..!

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ఉద్యోగుల బదిలీలు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి, జిల్లా కలెక్టర్ సూచనలు పరిగణలోకి తీసుకుని ఉద్యోగుల బదిలీలు చేస్తున్నాం. ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులు తప్పకుండా కదలాలి. ఇక బదిలీలకు సంబంధించి ఏ ఉద్యోగి ఎవరికి ఎటువంటి సొమ్ము ఇవ్వరాదు, అటువంటి అపోహలను ఎవరూ నమ్మొద్దు. పూర్తి పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలను చేపడుతున్నాం. ఇందులో ఎటువంటి సందేహం అవసరం లేదు.



- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ



డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయం

ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ

బదిలీల నేపథ్యంలో ఉద్యోగులు సిఫారసుల లేఖ కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదివరకు పనిచేసిన మండలాలకే మళ్లీ పోస్టింగ్ కావాలని కొందరు డీఆర్‌డీఏ-వెలుగు, డ్వామా ఉద్యోగులు పట్టుపడు తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో పనిచేసిన ఉద్యోగులకే తిరిగి కూటమి ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో ప్రాధాన్యం కలిగిన స్థానాలను సాధించుకున్న ఉద్యోగులే ప్రస్తుతం అదే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలోని ప్రజాప్రతినిధుల చుట్టూ డ్వామా, డీఆర్‌డీఏ ఉద్యోగులు సిఫారసుల లేఖల కోసం తిరుగుతున్నారు.

డీఆర్‌డీఏలో బదిలీలకు కమిటీ

డీఆర్‌డీఏ-వెలుగులో ఉద్యోగుల బదిలీలకు కమిటీ నియమించారు. పీడీ ఓబుళమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య, హెచ్‌ఆర్ ఏపీఎం శ్రీనివాసులు, డీపీఎం ఫైనాన్స్ మజ్జిగ సత్యనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా పీడీ నరసయ్య, డీపీఎం ఫైనాన్స్ పీడీ, రామిరెడ్డి, లైవ్లీ హుడ్స్ డీపీఎం రామ్మోహన్‌లు కమిటీలో ఉన్నారు. ఇప్పటికే టీటీడీసీలో కమిటీ ఇటీవల సమావేశం నిర్వహించి బదిలీలపై చర్చించారు. ఇదివరకు పనిచేసిన మండలాలకు తిరిగి పోస్టింగ్ ఇవ్వరాదని నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో పనిచేసిన పీడీ కొందరు ఉద్యోగులతో రూ.2లక్షల వరకు తీసుకుని బదిలీలు చేశారని, ఆ బదిలీలను నిలిపివేయాలని ఉద్యోగులు పట్టుపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం చివరిలో ఇలా అప్పటి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, ముడుపులు పుచ్చుకుని కోరుకున్నచోటకు బదిలీ చేశారనే విమర్శలు ఉన్నాయి. డీఆర్‌డీఏ-వెలుగులో ఏపీడీ, డీపీఎం, ఏసీ, ఏపీఎంలు, సీఓల స్థాయిలో ఉద్యోగులు బదిలీల కోసం యత్నిస్తున్నారు.

గతంలో పని చేసిన మండలాలే కావాలని పట్టు

డ్వామా ఉద్యోగుల బదిలీల్లో గందరగోళంగా ఉంది. బదిలీల కోసం వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు సమాచారం. ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్ విభాగం కేంద్రంగా ఈ ముడుపుల బాగోతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు హెచ్‌ఆర్ విభాగంలో అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉద్యోగుల ద్వారా రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత నెల 31 వరకు ఉన్న బదిలీలకు చివరి గడువును ఈనెల 15దాకా పొడిగించారు. దీంతో ఉద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ బాగోతాన్ని కొందరు ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు చేరవేసినట్లు సమాచారం. గత నెలలో 8 మంది ఏపీఓలను బదిలీ చేయగా కంబదూరులో ఏపీఓ సుజాత ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. గతంలో పనిచేసిన బుక్కరాయసముద్రం మండలమే తనకు కావాలని పట్టుపడుతున్నట్లు సమాచారం. ఇలా డ్వామాలో పలువురు ఉద్యోగులు తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి అన్ని దారులను వెతుక్కుంటున్నారు. అయితే ఇందులో ముడుపులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆశాఖలో చర్చించుకుంటున్నారు. డ్వామాలో ప్రధానంగా ఏపీడీ, ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల్లో ముడుపులకు తెరలేపుతున్నట్లు ఆశాఖలో ఉద్యోగులే చెబుతున్నారు.

వరద బాధిత ప్రాంతాల్లో పరిటాల సునీత పర్యటన



బాధితులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం అర్బన్ సెప్టెంబరు 10: విజయవాడలోని వరదబాధిత ప్రాంతాల్లో పరిటాల సునీత మంగళవారం పర్యటించారు. 61వ డివిజన్‌లో పర్యటించి బాధితుల కష్టాలను తెలుసుకున్నారు. పలువురికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రబాబు రాత్రింబవళ్లు పరిస్థితులను పర్యవేక్షించి బాధితులకు సహాయక చర్యలు అందేలా చేశారని కొనియాడారు.

ఆర్థిక సాయం





సీఎం చంద్రబాబుకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేశారు.

శింగనమల: వరద బాధితులకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ. 1.91 లక్షలు విరాళంగా ఇచ్చారు. చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు. అదేవిధంగా బాధిత ప్రాంతాల్లో పర్యటించి వెయ్యి కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు.

రామగిరి: యువకులు విజయవాడ వరద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. కానగులకుంట, రామగిరి బీసీకాలనీలోని యువకులు విరాళాల ద్వారా వచ్చిన రూ.17,300లు మొత్తాన్ని గ్రామపెద్దల సమక్షంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు జమచేశారు. శివశంకర్, శేషంపల్లి రవికుమార్, కురువాండ్లపల్లి రామాంజినేయులు, నాగరాజు తదితరులు విరాళాలు సేకరించారు.

కాంప్లెక్స్ సమావేశ తేదీలను మార్చండి: ఎస్టీయూ



వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 10: కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించే తేదీలను మార్చాలని ఎస్టీయూ నాయకులు కోరారు. మంగళవారం ఆ సంఘం జిల్లా నాయకులు ఇన్‌చార్జి డీఈఓ కృష్ణయ్య, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజును వేర్వేరుగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. మాలపున్నమి(మహాలయ పౌర్ణమి) ఈనెల 17, 18వ తేదీన ఉందని, ఆ రోజు కాంప్లెక్స్ మీటింగ్ వద్దని 19, 20వ తేదీల్లో నిర్వహించాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజినేయులు, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకే ఐటీకి స్వయం ప్రతిపత్తి



మాట్లాడుతున్న చైర్మన్ పల్లె కిశోర్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 10: పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పదేళ్లపాటు స్వయం ప్రతిపత్తి లభించింది. దీంతో మంగళవారం కళాశాల ఆవరణలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పల్లె కిశోర్ మాట్లాడుతూ పీవీకేకే ఐటీ విద్యారంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే ఎన్‌బీఏ, ఎన్ఏఏసీ గుర్తింపు పొందిందన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయ స్థాయికి ఎదగడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లె రఘునాథరెడ్డి, కోశాధికారి పల్లె సింధూర, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, యాజమాన్యప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బండిరమేష్‌బాబు, ఏఓ మనోహర్‌రెడ్డి, డిప్లొమో ప్రిన్సిపాల్ వైభవ్, శ్రీబాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మదేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న నాయకులు

గార్లదిన్నె, సెప్టెంబరు 10: గుంతలమయమైన రోడ్డుకు టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మంగళవారం మట్టి తోలించి మరమ్మతు చేయించారు. గార్లదిన్నె నుంచి కోటంకకు మర్తాడు వెంట వెళ్లే ప్రధాన రహదారి కొన్నేళ్లుగా గుంతలమయమైంది. దీంతో స్పందించిన ఆవుల కృష్ణయ్య రోడ్డుకు మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గోరకాటి వెంకటేశు, బీసీసెల్ అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య, క్లష్టర్ ఇన్‌చార్జి ఆవుల శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశు, ఎస్సీసెల్ అధికారి ప్రతినిధి బూడిద కిష్టప్ప, వార్డు మెంబరు రాము, నల్లని తాతయ్య పాల్గొన్నారు.

సాధనలో స్టార్లు

నెట్‌ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన భారత ఆటగాళ్లు

రేపటి నుంచి దులీప్‌ట్రోఫీ సెకండ్ రౌండ్‌పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 10: దులీప్ ట్రోఫీలో రెండో రౌండ్ పోటీలు గురువారం నుంచి అనంతపురం క్రికెట్ మైదానంలో ప్రారంభం కానున్నాయి. ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే అనంతపురానికి చేరుకున్న ఇండియా ఎ, బి, సి, డి జట్ల ఆటగాళ్లు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఉదయం ఇండియా-సి, ఇండియా-బి, మధ్యాహ్నం ఇండియా-ఎ, ఇండియా-డి జట్ల ఆటగాళ్లు సాధన చేశారు. గురువారం నుంచి ఏసీజీ ఎ, బి స్టేడియాల్లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఎ గ్రౌండ్‌లో ఇండియా-ఎ, ఇండియా డి జట్ల మధ్య, బి గ్రౌండ్‌లో ఇండియా-బి, ఇండియా-సి జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.



ఆటగాళ్ల కసరత్తులు

స్వల్ప మార్పులతో జట్ల ప్రకటన

స్వల్పమార్పులతో దులీప్‌ట్రోఫీలో పాల్గొనే జట్లను బీసీసీఐ ప్రకటించింది. ఇండియా-ఎ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, ధృవ్‌జురెల్, కుల్దీప్‌యాదవ్, ఆకాష్‌దీప్ బంగ్లా దేశ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కోసం వెళ్లగా వారిస్థానంలో ప్రథమ్ సింగ్, అక్షయ్‌వాడ్కర్, ఎస్‌కే రషీద్, షామ్స్‌ములాని, అకిబ్ ఖాన్‌లను ఎంపిక చేశారు. ఇక ఇండియా-ఎ జట్టు కెప్టెన్‌గా మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. ఇండియా బీలో ఉన్న యశస్వి జైస్వాల్, రిషబ్‌పంత్ స్థానంలో సుయాష్ ప్రభుదేశాయి, రింకూసింగ్‌లను ఎంపిక చేశారు. ఇక మిగిలిన ప్లేయర్లు బీసీసీఐ గతంలో ప్రకటించిన విధంగా ఆయా జట్ల తరఫున ఆడనున్నారు.



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ఏర్పాట్లు, భద్రతాచర్యల పరిశీలన

దులీప్‌ట్రోఫీ రెండో రౌండ్‌పోటీలకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ పరిశీలించారు. ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, అందుకు అవసరమైన సహకారం అందించాలని పోలీసులకు సూచించారు. గ్రౌండ్‌లోకి ప్లేయర్లు రావడం, బస చేసే హోటళ్ల వద్ద భద్రతా చర్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మహిళా జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ లాజిస్టిక్ మేనేజర్ గౌరీశంకర్, అడ్మిన్ మేనేజర్ ఆదిత్యవర్మ, రాహుల్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, పగడాల మల్లికార్జున ఏజేపీ తీర్థ పాల్గొన్నారు.

పాసుల జారీపై రాని స్పష్టత

దులీప్‌ట్రోఫీ రెండో రౌండ్ క్రికెట్ పోటీలకు సంబంధించి పాసుల జారీపై స్పష్టత రావడం లేదు. మ్యాచ్‌కు ఒక్క రోజు మాత్రమే గడువు ఉన్నప్పటికీ ఆర్గనైజింగ్ కమిటీ ప్రేక్షకులకు పాసులు జారీ చేయలేదు. దీంతో ప్రేక్షకులు గందరగోళంలో పడ్డారు. పైగా పాసులు లేకుండా లోపలికి అనుమతిస్తారా? లేక పాసులు ఇస్తారా? పాసులు ఇస్తే ఎప్పుడు ఇస్తారో? అనే పరిస్థితుల్లో ప్రేక్షకులు ఉండిపోయారు. ఇదిలా ఉంటే పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలు, సబ్ సెంటర్లు, అకాడమీలకు దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ల కోసం గ్యాలరీల పాసులను జారీ చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ప్రకటించారు. దీంతో సాధారణ ప్రేక్షకులను అయోమయంలో పడేశారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ

డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై రోగులతో ఆరా

అనంతపురం టౌన్, సెప్టెంబరు 10: సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సిటీ స్కాన్, పారా మెడికల్, ఐసీయూ, కార్డియాలజీ, న్యూరాలజీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో యంత్రాల పనితీరుపై ఆరాతీశారు. ఎంత మంది డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు..? ముఖహాజరు వేస్తున్నారా..? సమయపాలన పాటిస్తున్నారా..? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు,మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయా..? డాక్టర్లు, సిబ్బంది మంచిగా వైద్యం అందిస్తున్నారా..? అంటూ రోగులు, వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ జిల్లాకు వరమన్నారు. అలాంటి ఆసుపత్రిలో బాధ్యతగా విధులను నిర్వర్తించాలని సూచించారు. రోగులకు మంచిగా వైద్యం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి నిధులు వచ్చేలా, ఖాళీగా ఉన్న స్టాఫ్ వివరాలకు సంబంధించి డీఎంఈకి ప్రతిపాదనలు పంపాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ సుభాస్ చంద్రబోస్, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్, ఎంఎస్ఐడీసీ ఈఈ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నీట మునిగిన యువకుడు

ధర్మవరంరూరల్ (కనగానపల్లి), సెప్టెంబరు 10: మండలంలోని కుర్లపల్లి తండాలో వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి వినాయక నిమజ్జనానికి ఊరేగింపుగా గ్రామశివారులోని చెక్‌డ్యాం వద్దకు యువకులు వెళ్లారు. నిమజ్జనం చేస్తుండగా ఇంద్రవత్‌సాయినాయక్ కాలుజారి నీళ్లల్లో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటమునిగాడు. తోటి యువకులు గమనించి బయటకు లాగారు. కడుపునిండా నీరు తాగడంతో ప్రథమ చికిత్స చేసి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆ యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 10: అనారోగ్యంతో మృతి చెందిన స్వీపర్ నాగప్ప కుటుంబానికి జిల్లా పోలీస్‌శాఖ ఆర్థిక సాయం అందించింది. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు కొత్తచెరువులోని నాగప్ప కుటుంబ సభ్యులకు ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐ మధు పర్యవేక్షణలో ఏఆర్ ఎస్ఐ ముస్తఫా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు రూ.25వేలు అందించారు.

ఇద్దరు వెటర్నరీ వైద్యులకు ఏడీలుగా ఉద్యోగోన్నతి

అనంతపురం అర్బన్ సెప్టెంబరు 10: జిల్లాలోని ఇద్దరు వెటర్నరీ డాక్టర్లకు ఏడీలుగా ఉద్యోగోన్నతి లభించింది. బొమ్మనహాల్ మండలం శ్రీధరగుట్ట వెటర్నరీ డాక్టర్ ఉమామహేశ్వరను ఉద్యోగోన్నతిపై ఉరవకొండ వెటర్నరీ ఆస్పత్రి ఏడీగా బదిలీ చేశారు. బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వెటర్నరీ డాక్టర్ పెద్దన్నను జేడీ ఆఫీస్ ఏడీగా బదిలీ చేశారు.

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల ఆందోళన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 10: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మంగళవారం సర్వజన ఆసుపత్రిలో విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం జీవో 115ను విడుదల చేయడం దారుణమన్నారు. దీని వల్ల తమకు అన్యాయం జరుగుతుందన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ, నారాయణమ్మ, శోభ, నీలిమ పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘననివాళి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 10: చాకలి ఐలమ్మకు ఏపీ రజకసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని దోబీఘాట్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ రజకసంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు ఆనంద్, సుబ్రమణ్యం, శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా రజక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర సెక్రటరీ కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి రంగనాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

నార్పల, సెప్టెంబరు 10: టీడీపీ నాయకుడు పురుషోత్తం మృతికి నాయకులు నివాళులు అర్పించారు. పురుషోత్తం అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ప్రసాద్, విజయ్‌బాబు తదితరులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఆలం నరసానాయుడు

కిమ్స్ సవీరాలో అరుదైన ఆపరేషన్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 10: కిమ్స్ సవీరాలో అరుదైన ఆపరేషన్‌ను డాక్టర్లు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మహమ్మద్ షాహిద్ మంగళవారం తెలిపారు. శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెందిన 50 ఏళ్ల చిక్కమ్మ ఆకలి మందగించడం, అన్నం తినకపోవడం, గ్యాస్ సమస్య తీవ్రం కావడంతో చికిత్స నిమిత్తం సవీరా ఆసుపత్రికి వచ్చింది. పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ రెండో దశలో ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే పొట్ట మొత్తం తొలగించి చిన్నపేగులను ఆహారనాళానికి కలపాల్సి వచ్చిందని డాక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ ఉన్నారు.



చిక్కమ్మతో కిమ్స్ సవీరా వైద్యులు

ఇసుక డంప్ సీజ్

శింగనమల, సెప్టెంబరు 10: మండలంలోని పెద్ద జలాలపురం వంకలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య దాడి చేసి సీజ్ చేశారు. ఇసుక డంప్ వద్ద ఉన్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సబ్సిడీ ఉలవల పంపిణీ

శింగనమల, సెప్టెంబరు 10: రైతులకు సబ్సిడీ ఉలవలను మంగళవారం పంపిణీ చేశారు. కల్లుమడి రైతు భరోసా కేంద్రంలో గుమ్మేపల్లి సర్పంచ్ డేగల లలితమ్మ, టీడీపీ నాయకుడు డేగల కృష్ణమూర్తి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లుమడి సర్పంచ్ పక్కీరమ్మ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

ఆత్మకూరు, సెప్టెంబరు 10: డిగ్రీ చదువుతున్న సరితను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ హేమంత్‌కుమార్ తెలిపారు. అరెస్టుకు సంబంధించి మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. గుమ్మగట్ట మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన గోనబావి తిప్పేస్వామి అలియాస్ పండు హత్య చేశాడన్నారు. గుమ్మగట్టు మండలం సిరిగెదొడ్డి గ్రామానికి చెందిన సరితను నాలుగేళ్లుగా వేధించాడన్నారు. సరితను పెళ్లి చేసుకుంటానని అడగ్గా ఆమె తండ్రి ఒప్పుకోలేదన్నారు. దీంతో అనంతపురంలోని ఆమె హాస్టల్ వద్దకు వెళ్లి మానసికంగా వేధించేవాడని వివరించారు. తనను మానసికంగా వేధిస్తున్నట్లు తెలిస్తే చదువుమానిపిస్తారని సరిత విషయాలను ఇంట్లో చెప్పకుండా భరించేదన్నారు. వినాయక చవితి రోజు సరితకు ఫోన్‌చేసి కలవాలని డిమాండ్ చేశాడు. పంపనూరు పార్కు దగ్గర నుంచి తన బైక్‌పై ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్న కాలువ గట్టువద్దకు తీసుకెళ్లాడు. సరిత ఫోన్‌లో మాట్లాడుతుండగా వెనుక వైపు నుంచి కొడవలితో హత్య చేశాడు. గోనబావి తిప్పేస్వామిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచడం జరిగిందన్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 10: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ప్రథమ, తృతీయ, ఐదో సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శించడం జరిగిందన్నారు.

అనంత విద్యార్థికి బంగారు పతకం

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 10: నగరానికి చెందిన ఆదిశేషయ్య, లలిత దంపతుల కుమార్తె జయప్రీతి బంగారు పతాకాన్ని సాధించింది. బెంగళూరు యూనివర్సిటీ అనుబంధ కళాశాల ది ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఎమ్మెస్సీ అప్లైడ్ జెనటిక్స్ విభాగంలో 10 సీజీపీఏకు గాను ఏకంగా 9.11 సాధించి ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుంది. మంగళవారం సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన 59వ స్నాతకోత్సవంలో వీసీ జయకరన్, యూజీసీ వైస్‌చైర్మన్ దీపక్‌కుమార్, కర్ణాటక ఉన్నత విద్యాశాఖమంత్రి సుధాకర్ చేతులమీదుగా బంగారుపతకంతోపాటు డాక్టర్ ఎన్‌జే శెట్టి క్యాష్ ప్రైజ్ అందుకుంది.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కోటంక సుబ్రహ్మణ్యుడి హుండీ లెక్కింపు

గార్లదిన్నె, సెప్టెంబరు 10: గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రెండు నెలలకు సంబంధించి రూ. 2, 34, 838 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి వన్నూరుస్వామి, ఈఓ బాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రిస్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు పాల్గొన్నారు.

పంపనూరు సుబ్రహ్మణ్యుడిని దర్శించుకున్న ఎస్పీ



స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు సెప్టెంబరు 10: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని మంగళవారం ఎస్పీ జగదీష్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఎస్పీకి అధికారులు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాయి, ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టిపెట్టండి: ఎస్పీ

గార్లదిన్నె: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ జగదీష్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో చర్చించారు. సిబ్బంది వసతులపై ఆరాతీశారు.

పీడీఎస్ బియ్యం సీజ్



సీజ్ చేసిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 10: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భవానీ నగర్ ఎన్టీఆర్ మార్గ్ సమీపంలో బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం రావడంతో సీఐ జమాల్ బాషా దాడులు చేశారు. 37 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం 74 సంచుల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలించడానికి నిల్వ ఉంచినట్లు తేల్చారు. ఆ బియ్యాన్ని, తరలించడానికి ఉంచిన వాహనాన్ని సీజ్ చేశారు. యజమాని తరుణ్‌తేజ, ఎండీయూ ఆపరేటర్ కృష్ణమూర్తి, సహాయకురాలు సల్మాలపై 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఏఈఈ రవీంద్రనాథ్, డీసీటీఓ జయలక్ష్మి పాల్గొన్నారు.

రూ.25వేలు పలికిన లడ్డూ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 10: మండలంలోని చిన్నంపల్లి గ్రామంలో వినాయకుడి మండపం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. రాగుల పవన్‌కల్యాణ్ రూ.25వేలకు దక్కించుకున్నాడు.

వైసీపీ కార్యకర్తల దాడి

శింగనమల సెప్టెంబరు 10: మండలంలోని సోదనపల్లిలో సోమవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు. దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వినాయక విగ్రహాన్ని వైసీపీ కార్యకర్తలు నిమజ్జనానికి తరలిస్తూ టీడీపీ కార్యకర్త ఉండి వద్ద ఆగారు. అక్కడ వైసీపీ పార్టీకి సంబంధించిన పాటలను పెట్టి రచ్చ చేస్తుండగా టీడీపీ కార్యకర్తలు చందన, తిరుపాలు, రమేష్ అడ్డుకున్నారు. దీంతో వైసీపీ కార్యకర్తలు భవానీప్రసాద్, అనిల్‌కుమార్‌రెడ్డి, అభిలాష్ వారిపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మంగళవారం వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్

అనంతపురం అర్బన్ సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని నగరంలో బుధవారం ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను బంద్ చేస్తున్నట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను బుధవారం బంద్ చేయనున్నట్లు తెలిపారు.



కల్లూరులో నిరసన తెలుపుతున్న తాగునీటి కార్మికులు

వేతనాలు ఇచ్చే వరకు సమ్మె

సత్యసాయి తాగునీటి కార్మికులు

గార్లదిన్నె, సెప్టెంబరు 10: బకాయి వేతనాలు చెల్లించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 20వ రోజుకు చేరుకుంది. వేతనాలు చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. సమ్మెలో నాగభూషణం, బాషా, మలరాయుడు, సాంబశివ పాల్గొన్నారు.

విజయవాడలో 'అనంత' చేనేత వస్త్ర ప్రదర్శన

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 10: జిల్లా చేనేతలు తయారుచేసిన వస్త్రాలను విజయవాడలో ప్రదర్శన ఉంచనున్నట్లు చేనేత, జౌళిశాఖ ఏడీ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని శ్రీసాయి కల్యాణవేదికలో 13, 14న బయ్యర్ సెల్లర్‌మీట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సహకార సంఘాలు, మస్టర్ వీవర్లు, చేనేత కళాకారులు తయారుచేసిన వస్తువులను ప్రదర్శిస్తారని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 10: తమతోపాటు చదివిన మిత్రుడు ఆకస్మికంగా మృతిచెందడంతో స్నేహితులు ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. న్యామద్దల గ్రామానికి చెందిన నాగరాజు ఆగస్టులో మృతిచెందాడు. దీంతో అతడి స్నేహితులు మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 72 వేల నగదును భార్య చంద్రకళకు అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి

● ఎస్పీ జగదీష్



పామిడి పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

పామిడి, సెప్టెంబరు 10 : మండలంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతి భద్రతలు, నేరాలు, పెండింగ్ కేసులపై సీఐ యుగంధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడే కేసులను ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి స్వచ్ఛందంగా రాజీ పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15లోగా ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి : జేడీఏ

విడపనకల్లు, సెప్టెంబరు 10: రైతులు సాగు చేసిన పంటల ఈ క్రాప్ బుకింగ్‌ను ఈ నెల 15వ తేదీకి పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని పాల్తూరులో రైతు సేవా కేంద్రాలను జేడీఏ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఏఓలతో మట్లాడుతూ.. మండలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 19వేల ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ చేశారని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందించే ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓలు, ఏఏఓ, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు : తహసీల్దార్

కూడేరు, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ తహసీల్దారు మహబూబ్ బాషా పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్‌ఓ రమేష్ తదితరులతో కలిసి కూడేరులోని జగనన్న కాలనీలో పర్యటించారు. ఇటీవల కొందరు వ్యక్తులు జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాలను ఆక్రమించుకుం టున్నారని ఫిర్యాదు చేయడంతో పర్యటించినట్లు తహసీల్దార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



నల్లబోతుల రవి మృతదేహం

పామిడి, సెప్టెంబరు 10: పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై నల్లబోతుల రవి (24) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. పట్టణంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన నల్లబోతుల రవి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. పనుల్లో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్ల నిర్మాణానికి స్లాబ్ వేస్తున్నాడు. ఈ క్రమంలో పై నుంచి కిందకు దిగుతూ తరగతి గది వరండాలోని ఐరన్ గ్రిల్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తోటి భవన నిర్మాణ కార్మికులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని సీఐ యుగంధర్ పరిశీలించి సంఘటనపై ఆరా తీశారు. స్లాబ్‌కు వైబ్రేటర్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ దెబ్బతినడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు వీరాంజనేయులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల దాతృత్వం: పాఠశాలలో విద్యుదాఘాతంతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రవి కుటుంబానికి ఉపాధ్యాయ బృందం మానవత్వంతో ఆర్థికసాయం చేసింది. ఆ పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది రూ. 80వేలు, ఎంఈఓ జయానాయక్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హుండీలో నగదు చోరీ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 10: మండలంలోని భూపసముద్రం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శివాలయం లో చోరీకి పాల్పడ్డారు. శివాలయం తాళాలు పగులగొట్టి లోపల ఉన్న హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.5వేలకుపైగా నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయం అర్చకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుమ్మఘట్ట పోలీసులు గ్రామానికి చేరుకొని శివాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అయితే సీసీ కెమెరాకున్న వైర్లు తెగిపోవడంతో అది కొద్దిరోజులుగా పనిచేయలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.

కూలిన మట్టిమిద్దె

పెద్దపప్పూరు, సెప్టెంబరు 10: మండలంలోని ముచ్చుకోట గ్రామంలో మంగళవారం ఉదయం చాకలి పెద్దన్నకు చెందిన మట్టిమిద్దె పైకప్పు కూలిపోయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు.

గుంతల గుత్తి

● ప్రయాణికులకు అవస్థలు

గుత్తి, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని గుంతకల్లు, పత్తికొండ రహదారులు దెబ్బతిన్నాయి. వీటిపై వెళ్లాలంటే ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతకల్లు రోడ్డులోని ఎంబీఏ కళాశాల ఎదురుగా పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. భారీ ఎత్తున గుంతలు పడి రోడ్డంతా అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే గుంతకల్లు రోడ్డులో గుంతను తప్పించే క్రమంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో భారీ ఎత్తున పత్తికొండ రహదారి దెబ్బతిని గుంతలు పడ్డాయి. వర్షాలు కురిసినప్పుడు ఆ గుంతలలో నీరు నిలుస్తోంది. దీంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనాలు ఆ గుంతల్లో పడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



గుంతలు పడిన గుంతకల్లు రోడ్డు



గుంతకల్లు రోడ్డులోని ఎంబీఏ కళాశాల వద్ద ఇలా...



పత్తికొండ రోడ్డులో ఏర్పడిన గుంతలు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు



తిరుమల ఆలయం ఎదుట ఎమ్మెల్యే, కుటుంబసభ్యులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 10: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ కుమారుడు ఇషాన్‌సాయి జన్మదినం పురస్కరించుకుని కుటుంబసభ్యులంతా కలసి స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు, గుంతకల్లు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో అనంతపురం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు దంపతులు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతికి ఆనవాళ్లు: ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 10: జాతరలు పురాతన సంస్కృతికి ఆనవాళ్లని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో జరిగిన మారమ్మ జాతరలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామదేవతల వల్ల ఆయా గ్రామాలు పంటల తో కళకళలాడాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళకుర్తి సుదర్శన్, గొడిశలపల్లి హనుమంతరెడ్డి, బీటీ రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జీడీపల్లికి 1040 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 10: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1040 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 940 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 60 క్యూసెక్కులు వెళుతోందని అధికారులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాడికి, సెప్టెంబరు 10: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన గడ్డం మధు (50) అనే వ్యక్తి కర్నూలులో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. యాడికిలోని ఓంశాంతికాలనీకి చెందిన గడ్డం మధు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య చంద్రకళ, ఏడేళ్ల కుమారుడు, ఐదేళ్లకుమార్తె ఉన్నారు. ఈనెల 7న వినాయకచవితి సందర్భంగా వినాయకులను చూడడానికి బయటకు వచ్చిన గడ్డం మధు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల అరెస్ట్

యాడికి, సెప్టెంబరు 10: యాడికిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు అపరిచిత వ్యక్తులను మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. తెల్లవారుజామున 5గంటల సమయంలో నైట్ పెట్రోలింగ్ చేస్తుండగా వాగ్దేవి కాలేజీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. పామిడికి చెందిన డేరంగుల వీరయ్య, ముదిగుబ్బ మండలం ఎనుములపల్లికి చెందిన శ్రీనివాసులుగా వారిని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్‌చేసి వారిని సోదా చేశామన్నారు. వారి వద్ద నుంచి ఏడు స్పానర్‌లు, మూడు రెంచు లు, నాలుగు బిట్లు, మూడు ఎల్‌బిట్లు, ఒక కొవ్వొత్తి, అగ్గిపెట్టె స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు ఎక్కడైనా అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

కాలేజీలో ఆత్మహత్యల నివారణ దినం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 10: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడు తూ... ప్రతి మనిషి జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారని అన్నారు. సమస్యలు వచ్చినపుడు మానసిక దౌర్బల్యంతో ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదన్నారు. యువత ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, బాబు, దేవదాసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీ నారాయణ, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కార్మికుల భిక్షాటన



భిక్షాటన ద్వారా నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 10: వేతన వ్యథలు తీర్చాలంటూ శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరింది. అందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీఐటీయూ నాయకులు, కార్మికులు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతప్రసాద్ మాట్లాడుతూ... ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులు తిప్పేస్వామి, నరేష్, నాగప్ప, రామాంజి, పరంధామ తదితరులు పాల్గొన్నారు.

జీవో 85కు వ్యతిరేకంగా నిరసన

తాడిపత్రి, సెప్టెంబరు 10: స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణంలో మంగళవారం ప్రభుత్వం తెచ్చిన జీవో 85కు వ్యతిరేకంగా వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు మండలాల నుంచి వైద్యులు, సిబ్బంది ఏరియా ఆసుపత్రికి వచ్చి నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యుల సర్వీసు కోటాను 30శాతం నుంచి 15శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 85ను రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో సమ్మెకు సిద్ధమని తెలిపారు. నిరసన కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్, హిమబిందు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గాలిమరల కార్మికుల నిరసన

పుట్లూరు, సెప్టెంబరు 10: తమకు జీతాలు చెల్లించలేదని మండలంలోని ఎల్లుట్ల గ్రామశివారులో ఉన్న గాలిమరల్లో పనిచేసే కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలిమరల నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ హేమాద్రి మాట్లాడుతూ కార్మికులు కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారని, సమయానికి చెల్లించాలని సూచించారు. దీంతో కూలీలు నిరసనను విరమించారు.

మెరుగైన సేవల కోసమే అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్: డీఎంహెచ్ఓ



స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబాదేవి

బెళుగుప్ప, సెప్టెంబరు 10 : గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలం దించడంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కార్తీక్ రెడ్డి, ప్రియాంకకు సూచించారు. గైనకాలజిస్టు నియమించి త్వరలోనే అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

ఉరవకొండ: మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి పరిశీలించారు. నిర్మాణం పనులు త్వరిత గతిన పూర్తి చేసి తమకు అప్పగిస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. జిల్లా వైద్యాధికారులు త్యాగరాజు, గంగాధర, సీసీ వేమారెడ్డి, డాక్టర్లు పావని, వెంకటేష్ నాయక్, మనోజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాథ్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపప్పూరు, సెప్టెంబరు 10: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం బోధించడానికి గెస్ట్‌ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శంకర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. ఆసక్తిగలవారు మూడురోజుల్లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

అన్నం తింటున్నవారిని తీసుకెళ్లి కొట్టారు..!

తాడిపత్రి, సెప్టెంబరు 10: పట్టణంలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్న ఇద్దరు సామాన్యులపై మంగళవారం ఓ పోలీసు ఉన్నతాధికారి అధికార దర్పం చూపించారు. ఇద్దరు యువకులు వాటర్ ట్యాంక్ ఆటోను నడిపి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేయడానికి ఓ హోటల్ వద్ద పక్కన ఆటోను నిలిపి లోనికి వెళ్లారు. ఆ సమయంలోనే ఓ పోలీసు అధికారి వాహనం అటువైపుగా వచ్చి హోటల్ వద్ద నిలిపారు. అప్పుడే మరో వాహనం రావడంతో పోలీసు జీపు బయటకు రావడానికి సాధ్యం కాలేదు. దీంతో పోలీసు సిబ్బంది ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ హోటల్‌లోకి వెళ్లారు. ఆటో ఎవరిది, వెంటనే అక్కడి నుంచి తీసివేయాలని హుకుం జారీచేశారు. అక్కడి నుంచి ఆటోను తీసివేసేలోపే అన్నం తింటున్న ఆ యువకులను పోలీసు సిబ్బంది నానా దుర్భాషలాడుతూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, తమదైన శైలిలో కొట్టినట్లు తెలిసింది. ఆటోను అక్కడి నుంచి తీసివేయాలని చెబితే పోయేదానికి ఇంత దర్పం చూపితే ఎలా అని స్థానికులు విమర్శలు గుప్పించారు.

రెండ్రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తాం: ఈఈ

● కోతకు గురైన కాలువ గట్టు పరిశీలన



కోతకు గురైన కాలువ గట్టును పరిశీలిస్తున్న ఈఈ వెంకటరమణ

విడపనకల్లు, సెప్టెంబరు 10: గుంతకల్లు బ్రాంచ్(జీబీసీ) ప్రధాన కాలువ నాలుగో కిలోమీటర్ ఉండబండ పెద్ద కోతకు గురైన గట్టుకు రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని జీబీసీ ఈఈ వెంకటరమణ పేర్కొ న్నారు. ఆయన మంగళవారం డీఈ రఘుచరణ్, ఏఈలు పల్లవి, రాజశేఖర్, మంజునాథతో కలిసి కాలువపై పర్యటించి, దెబ్బతిన్న గట్టును పరిశీలించా రు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కాలువకు నాలుగో కిలో మీటర్ వద్ద అక్విడెట్ దారిపై భారీ వాహనం వెళ్లడంతో సైడ్ వాల్ కాలువలోకి కూలి పోయిందన్నారు. విషయం తెలుసుకున్న జీబీసీ అధికారులు అప్రమత్తం కావడంతో భారి నీటి నష్టాన్ని అరికట్టామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లను పిలిపించామని, బుధవారం సాయంత్రానికి గండిని పూడ్చి సైడ్ వాల్ నిర్మిస్తామన్నారు.

బ్రిడ్జిలు పాతబడటంతోనే సమస్యలు : ఈఈ

జీబీసీకి ఉన్న బ్రిడ్జిలు పాత బడి పోవటంతోనే ఇలాంటి సమస్యలు ఏర్ప డుతున్నాయని ఈఈ వెంకటరమణ పేర్కొన్నారు. జీబీసీ హెడ్ జీరో బై జీరో వద్ద నుంచి 59వ కిలోమీటర్ వరకు దాదాపు 60 బ్రిడ్జిలు ఉన్నాయని, అవన్నీ 52 సంవత్సరాల క్రితం నిర్మించినవన్నారు. కాలువ ఆధునీకరణ పనులు చేసిన సమయంలో ఒకటో ప్యాకేజీలో మాత్రమే 90శాతం లైనింగ్ పనులు పూర్తి చేశారన్నారు. రెండో ప్యాకేజీలో కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే ఆధునీకరణ పనులు చేసి వదిలేశారు అన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, ప్రభుత్వం మారిన తరువాత కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేశాడన్నారు.. చేసిన పనులకు బిల్లులు రాక పోవటం రెండో ప్యాకేజీ పనులు పూర్తి కాలేదని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో కవిత, జీబీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగోరోజు కొనసాగిన పూజలు



గాంధీకట్ట వద్ద గణనాథుడు

తాడిపత్రి, సెప్టెంబరు 10: పట్టణంలో వినాయక మండపాల వద్ద నాలుగోరోజు మంగళవారం పూజలు కొనసాగాయి. పలు మండపాల వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నేడు నిమజ్జనం

వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి ఊరేగింపుగా మధ్యాహ్నానికి ప్రధాన రహదారి సీబీరోడ్డుకు తీసుకురానున్నారు. దాదాపు 200 వినాయక విగ్రహాలు తరలిరానున్నాయి. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో గుంతకల్లు డీఎస్పీతోపాటు సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, ఈరన్న, సుబ్రహ్మణ్యం, రామసుబ్బయ్య, పదిమంది ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఏఆర్ కానిస్టేబుళ్లు, స్పెషల్‌పార్టీ పోలీసులు దాదాపు 200మందితో భద్రతను ఏర్పాటుచేశారు. మండంలోని ఆలూరు, యర్రగుంటపల్లి, చీమలవాగుపల్లి, బొందలదిన్నె గ్రామాల శివారులో ఉన్న చెరువులు, వంకలు, వాగుల్లో వినాయక నిమజ్జనం జరగనుంది.

రూ.1.42 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

తాడిపత్రి: పట్టణంలోని కేవీరెడ్డినగర్‌లో ఏర్పాటుచేసిన భారీ గణనాథుడి లడ్డూప్రసాదం రూ.1,42,100 గరిష్ట ధర పలికింది. అదే కాలనీకి చెందిన మనోజ్‌రెడ్డి, కీర్తిరెడ్డి వేలంలో దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

వరద బాధితులకు చేయూత



ఎమ్మెల్యే కాలవకు చెక్కును అందజేస్తున్న పొదుపు సంఘాల మహిళలు, మున్సిపల్ అధికారులు

రాయదుర్గం టౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలోని మెప్మా విభాగం తరపున ఆర్థిక సాయం అందజేశారు. మెప్మా పొదుపు సంఘాల అధ్యక్షురాలు పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం రూ. 1,21,200 చెక్కును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టీఎంసీ నారాయణరెడ్డి, మున్సిపల్ సీఈఓలు సంధ్య, కిరణ్మయి, మున్సిపల్ సిబ్బంది అబ్దుల్లా, సుధీర్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల ఫర్టిలైజర్స్ అండ్ పస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ తరపున విజయవాడ వరద బాధితుల కోసం రూ. 50 వేలు అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా తెలిపారు. సంబంధిత చెక్కును మంగళవారం రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కలిసి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్‌గుప్త, శరత్, తుకారం, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సాయం



ఎమ్మెల్యే అమిలినేనికి చెక్కును అందజేస్తున్న ఉపాధ్యాయుడు బద్దేనాయక్

కళ్యాణదుర్గం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపు మేరకు వరద బాధితుల కోసం శెట్టూరు మండలం మాకొడికి ఉన్న త పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బద్దేనాయక్ ఆగస్టు నెల జీతం రూ. 66,245ను విరాళంగా అందజే శారు. ఆయన మంగళవారం ఎమ్మెల్యేను కళ్యాణదుర్గంలో కలిసి చెక్కు అందించారు. ఎమ్మెల్యే ఆయన ను అభినందించారు.

చిన్నారి విరాళం

కళ్యాణదుర్గం(శెట్టూరు): మండలకేంద్రమైన శెట్టూరుకు చెందిన లావణ్య, మంజునాథ్ కుమారుడు చిన్నారి ప్రద్యుస్‌నాథ్ పుట్టినరోజు సందర్భంగా తన పాకెట్‌మనీ నుంచి రూ. 5116ను విజయవాడ వరద బాధితులకు విరాళంగా ఇచ్చాడు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చిన్నారిని మెచ్చుకుని, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బెస్తరపల్లి వాసులు...

కుందుర్పి : విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని బెస్తరపల్లికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రూ. 65100 సేకరించారు. ఆ మొత్తాన్ని టీడీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అందజేశారు. పార్టీ తరపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే విజయవాడ వరద బాధితుల కోసం మండల వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు బియ్యం బస్తాలు సేకరించారు. వాటిని విజయవాడ తరలించేందుకు సిద్ధంగా ఉంచారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి

● ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశర్వయ్య, ఏపీరైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజినేయులు యాదవ్ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రైతులు 20వేల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. 1305 రోజులు ఉద్యోగ సంఘాలు ఆందోళన చేశారన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, రైతు సంఘం మండల నాయకులు ఉమర్‌బాష, మల్లయ్య, చిదంబరం, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఆర్ఎస్‌లో నాణేల ప్రదర్శన

గుత్తి, సెప్టెంబరు 10: గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం ఎదురుగా ఉన్న రైల్వే పెన్షనర్స్ భవనం ఆవరణంలో మంగళవారం నాణేలు, నోట్ల ప్రదర్శన నిర్వహించారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని తాడిపత్రికి చెందిన రాయలసీమ నాణేముల సేకరణ సంఘం ఆధ్వర్యంలో పూర్వపు నాణేలను ప్రదర్శించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, రైల్వే అధికారులు, కార్మికులు సందర్శించారు.